సాక్షి ఏలూరు

ఆదివారం ׀ 23 ׀ ఏప్రిల్ ׀ 2023



విద్యుత్ శాఖలో నకిలీలు

విద్యుత్ శాఖలో 1997లో కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణలో అవకతవకలు జరిగినట్టు విజిలెన్స్ అధికారులు తేల్చినా చర్యలు తీసుకోలేదు. IIలో ▸



సెంటిమెంట్ వైపే మొగ్గు

అక్షయ తృతీయ సెంటిమెంట్ పనిచేసింది. జిల్లావ్యాప్తంగా శనివారం ఉదయం నుంచి బంగారు దుకాణాలు కొనుగోలుదారులతో కళకళలాడాయి. IIలో ▸

వాట్సాప్ స్టేటస్ మార్చమన్నాడని..



సినీ హీరోలను ఫోన్‌లో వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకునే విషయమై ఇద్దరు పెయింటర్ల మధ్య జరిగిన వివాదం హత్యకు దారి తీసింది. IIలో

న్యూస్‌రీల్

శ్రీవారి క్షేత్రంలో హైకోర్టు న్యాయమూర్తి



న్యాయమూర్తి జస్టిస్ మన్మధరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మధరావు శనివారం రాత్రి ద్వారకా తిరుమల కొండపైన అతిథి గృహానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను తణుకు బార్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. న్యాయమూర్తి ఆదివారం ఉదయం శ్రీవారిని, అమ్మవార్లను దర్శిస్తారని ఆలయ అధికారులు తెలిపారు.

పోటెత్తిన పారిజాతగిరి



బారులు తీరిన భక్తులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరి శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయంలో ప్రధానార్చకులు నల్లూరి రవికుమారాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు జరిగాయి. జిల్లా నలుమూలలతో పాటు భద్రాచలం, పరిసర ప్రాంతాల నుంచి వందలాది మంది కాలినడకన ఆలయానికి చేరుకుని స్వామిని దర్శించారు. భక్తులకు ఎం.హనుమంతరావు, ఎ.సుధాకర్, పి.అయ్యప్ప, ఎస్.అన్నపూర్ణ, వి.నాగేశ్వరరావు అన్నప్రసాద వితరణ చేశారు. వేసవి దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ వితరణ చేశారు. ఆలయ ఈఓ మానికల రాంబాబు, అభివృద్ధి కమిటీ సభ్యులు కె.బాలకృష్ణారెడ్డి, రెడ్డి రంగప్రసాద్, వాసవీ సాయి, నగేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రేపు యథావిధిగా స్పందన

ఏలూరు(మెట్రో): ఏలూరు కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి స్పందన కార్యక్రమాన్ని యథావిధిగా నిర్వహిస్తామని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే జిల్లాలోని అన్ని డివిజనల్, మండల, మున్సిపల్ కార్యాలయాల్లోనూ స్పందన కార్యక్రమంలో భాగంగా అర్జీలు స్వీకరిస్తామని పేర్కొన్నారు. అర్జీదారులు తప్పనిసరిగా కోవిడ్ నిబంధనలు పాటిస్తూ మాస్కు తప్పనిసరిగా ధరించి సామాజిక దూరం పాటించాలని కోరారు.

శ్రీవారి క్షేత్రం.. భక్తజన సాగరం



అనివేటి మండప ప్రాంతంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. శనివారం, ఇటీవల పదో తరగతి పరీక్షలు ముగియడంతో అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకున్నారు. వేకువజాము నుంచి భక్తుల తాకిడి కనిపించింది. ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతంలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, అనివేటి మండప ప్రాంతంతో పాటు కేశఖండన శాల ఇతర విభాగాలు భక్తులతో కిటకిటలాడాయి. సుమారు 30 వేల మందికి పైగా స్వామిని దర్శించినట్టు ఆలయ వర్గాలు చెబుతున్నాయి. సాయంత్రం వరకు రద్దీ కొనసాగింది.

24 నుంచి పాలకొల్లు రైల్వేగేటు మూసివేత

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు రైల్వేగేటు వద్ద మరమ్మతులు చేస్తున్న కారణంగా ఈనెల 24 నుంచి 27 వరకూ రైల్వేగేటు మూసివేస్తున్నట్టు స్టేషన్ మాస్టర్ టి.రామలింగేశ్వరరావు తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి తమకు సహకరించాలని కోరారు.

కంపెనీ భూములకు మోక్షం

దశాబ్దాల కల సాకారం

- సాగుదారులకే దర్భరేవు కంపెనీ భూములు
- నేడు రెవెన్యూ మంత్రి చేతుల మీదుగా పట్టాల పంపిణీ
- 1,602 మంది రైతులకు 1,754 ఎకరాల భూమి అందజేత
- బ్రిటిష్ కాలం నాటి సమస్యకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిష్కారం



నరసాపురం మండలంలో సాగులో ఉన్న దర్భరేవు కంపెనీ భూములు

నరసాపురం: నరసాపురం తీర గ్రామాల్లో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న పేద రైతుల భూముల సమస్యకు మోక్షం లభించింది. బ్రిటిష్ హయాంలో లీజుకు తీసుకుని తరతరాలుగా అనుభవిస్తున్న భూములకు సాగు చేస్తున్న రైతులనే హక్కుదారులు చేసే బృహత్తర కార్యక్రమానికి గతేడాది నవంబర్‌లో సీఎం జగన్ లాంఛనంగా శ్రీకారం చుట్టారు. ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు నరసాపురం మండలం దర్భరేవు గ్రామంలో రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు చేతులమీదుగా రైతులకు భూములను పంపిణీ చేయనున్నారు. దర్భరేవు కంపెనీ భూములను ప్రస్తుతం అనుభవిస్తున్న వారికే రూ.100 నామమాత్రపు కనీస ధరకు అప్పగించడంతో పాటు రిజిస్ట్రేషన్ చార్జీలను కూడా ప్రభుత్వమే భరిస్తోంది. ఈ మేరకు 1,754 ఎకరాల భూమిని 1,602 మంది రైతులకు పంపిణీ చేయనున్నారు. రిజిస్ట్రేషన్ పత్రాలు, పట్టాదారు పాసు పుస్తకాలతో సహా రైతులకు అందించనున్నారు.

కంపెనీ భూముల కథేంటంటే..

1921లో అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం దర్భరేవు చుట్టుపక్కల గ్రామాల్లోని 1,814 ఎకరాల భూమిని సాగు చేసుకునే నిమిత్తం పేదలకు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు రైతులు ది అగ్రికల్చర్ సొసైటీ కంపెనీ లిమిటెడ్ పేరుతో సంఘంగా ఏర్పడ్డారు. వీరికి 100 ఏళ్ల లీజు హక్కులు అప్పగిస్తూ 1921 జూలై 23న బ్రిటిష్ ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. అప్పటి నుంచి వాటిని కంపెనీ భూములుగా పిలుస్తున్నారు. అయితే 1926లో బ్రిటిష్ ప్రభుత్వం సర్వే చేపట్టి కాలువలు, డ్రెయిన్ల నిమిత్తం 60 ఎకరాలను గుర్తించి రైతుల నుంచి తీసుకుంది. దీంతో 1,754 ఎకరాలు రైతుల చేతుల్లో ఉన్నాయి. అప్పట్లో ఈ భూములు వ్యవసాయయోగ్యంగా లేకపోగా రైతులు కష్టపడి తరతరాలుగా వ్యవసాయం చేసి సాగులోకి తీసుకువచ్చారు.

కన్నేసిన టీడీపీ

2014లో టీడీపీ ప్రభుత్వం కంపెనీ భూములపై కన్నేసింది. రైతులకు భూములు అప్పగిస్తామని మభ్యపెట్టి కోట్లు దండుకుంది. 2019లో ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంలో నిబంధనలు పాటించకుండా అమలు సాధ్యం కాని జీఓ విడుదల చేసి కంపెనీ భూములకు పట్టాలిస్తామని రైతులను నమ్మబలికింది. ఎకరా రూ.1,000 ఇస్తామని చెప్పినా స్థానిక టీడీపీ నాయకులు రూ.20 వేల నుంచి రూ.50 వేల చొప్పున రైతుల నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసి మొండిచేయి చూపారు. దీంతో తాము మోసపోయామని గ్రహించిన బాధిత రైతులు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నరసాపురం ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజును కలిసి మొరపెట్టుకున్నారు. దీంతో ఎమ్మెల్యే ముదునూరి విషయాన్ని ముఖ్యమంత్రికి తెలియజేసి సబ్‌కలెక్టర్‌తో విచారణ చేయించారు. అవకతవకలు జరిగినట్టు నిర్ధారణ కావడంతో ప్రభుత్వం సీఐడీ విచారణకు ఆదేశించింది. ఇదిలా ఉండగానే ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి కృషితో జగన్ సర్కార్ అర్హులైన రైతులకు కంపెనీ భూములు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది.

సమగ్ర సర్వేతో అర్హుల గుర్తింపు

కంపెనీ భూములు సాగు చేసుకుంటున్న వారిలో అర్హులను సమగ్ర సర్వే ద్వారా ప్రభుత్వం గుర్తించి, రిజిస్ట్రేషన్లు చేయించడానికి ఉపక్రమించింది. భవిష్యత్‌లో రైతులకు న్యాయపరమైన ఇబ్బందులు లేకుండా కేబినెట్ ఆమోదం చేయించి, పక్కాగా జీఓతో భూములను పంపిణీ చేస్తున్నారు.

ముఖ్యమంత్రి చొరవతో..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చొరవతో కంపెనీ భూముల సమస్య పరిష్కారమైంది. దర్భరేవు కంపెనీ భూముల సమస్యపై సీఎం సానుకూలంగా స్పందించారు. సర్వేకు ఆదేశించడంతో పాటు రూ.100 కనీస ధరకు పొజిషన్‌లో ఉన్న సాగుదారులకు భూములు పంచాలని నిర్ణయించారు. సీఎం జగన్ నరసాపురం పర్యటనలో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఇప్పుడు పక్కాగా ఆ భూములను జిరాయితీగా రిజిస్ట్రేషన్ చేయడం, వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పట్టాదారు పాస్‌పుస్తకాలతో సహా అందిస్తాం. దీంతో ఈ సమస్యకు ఫుల్‌స్టాప్ పడుతుంది. రిజిస్ట్రేషన్ దస్తావేజులను రెవెన్యూ శాఖ మంత్రి చేతుల మీదుగా అందించేందుకు ఏర్పాట్లు చేశాం.

– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్ విప్

40 వేల మందికి ఇంటర్న్‌షిప్



జగన్‌మోహన్‌రెడ్డి, నోడల్ అధికారి

పాలకొల్లు సెంట్రల్: ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల నుంచి 40 వేల మంది విద్యార్థులు ఆరు నెలల ఇంటర్న్‌షిప్ కార్యక్రమంలో పాల్గొన్నారని నన్నయ్య యూనివర్సిటీ ప్రొఫెసర్, ఈసీ మెంబర్, ఇంటర్న్‌షిప్ నోడల్ అధికారి బి.జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక చాంబర్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో విలేకరులతో మాట్లాడుతూ వర్సిటీ పరిధిలోని పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో విద్యార్థులు ఇంటర్న్‌షిప్ చేస్తున్నారన్నారు. దీనివల్ల విద్యార్థులకు పని అనుభవం పెరిగి ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. గతంలో డిగ్రీ విద్యను మధ్యలో నిలుపుదల చేస్తే సర్టిఫికెట్ ఇచ్చేవారని కాదని, అయితే ప్రస్తుత విద్యా విధానంలో డిగ్రీ మొదటి సంవత్సరం పూర్తయిన తర్వాత విద్యను నిలుపుదల చేయాలనుకునే విద్యార్థులకు సర్టిఫికెట్, రెండో సంవత్సరం పూర్తయితే డిప్లమో సర్టిఫికెట్ ఇస్తారన్నారు. మూడో సంవత్సరం పూర్తయిన విద్యార్థికి డిగ్రీ సర్టిఫికెట్, నాల్గో సంవత్సరం పూర్తి చేస్తే ఆనర్స్ డిగ్రీ సర్టిఫికెట్ ఇస్తారన్నారు. ఆనర్స్ చేసిన విద్యార్థి పోస్టు గ్రాడ్యుయేషన్ ఒక సంవత్సరం చదివితే సరిపోతుందన్నారు. ఇంటర్న్‌షిప్ ద్వారా దూరప్రాంతాల పరిశ్రమలకు వెళ్లలేని విద్యార్థులకు కళాశాలల్లోనే శిక్షణ ఇస్తామన్నారు. కళాశాల చైర్మన్ కారుమూరి నరసింహారావు, ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

‘గురుకుల’ పరీక్షలకు సర్వం సిద్ధం

- జిల్లాలో 4,872 మంది విద్యార్థులు
- 7 పరీక్షా కేంద్రాల ఏర్పాటు



నూజివీడులో బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల

నూజివీడు: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమశాఖకు చెందిన బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాలల్లో ఐదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు ఈనెల 23న ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఏలూరు జిల్లాలోని ఏడు గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు పరీక్ష నిర్వహించనున్నారు. ఆయా కేంద్రాల్లో ఐదో తరగతికి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్‌కు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్‌టికెట్‌తో పాటు ఆధార్ కార్డులను తీసుకొని పరీక్ష కేంద్రం వద్దకు గంట ముందుగానే రావాలని సూచించారు. నిర్ణీత సమయానికి గంట ముందుగానే పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులను అనుమతించనున్నారు.

7 పాఠశాలలు : జిల్లాలోని ఏడు గురుకుల పాఠశాల/కళాశాలల్లో ప్రవేశాలకు ఐదో తరగతికి 2,711 మంది, ఇంటర్‌కు 2,161 మంది విద్యార్థులు దరఖాసు చేసుకున్నారు. వీరందరికీ హాల్‌టికెట్లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. నూజివీడు, వట్లూరు, పెదవేగి, పోలసానపల్లి, ద్వారకాతిరుమల, జంగారెడ్డిగూడెం, చింతలపూడిలోని గురుకుల పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.

● ఈద్ ముబారక్



జిల్లావ్యాప్తంగా రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ముస్లింలు ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నెల రోజులపాటు ఉపవాస దీక్షలు చేసిన ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేసి దీక్షలను విరమించారు. ఏలూరులోని జీడీ కాలనీ మసీదులో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింల దృశ్యమిది.

– ఏలూరు (ఆర్ఆర్‌పేట)

ధాన్యం కొనుగోలు నిబంధనల సవరణ



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ కిషోర్

ఏలూరు(మెట్రో): రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బీకే) ద్వారా ధాన్యం కొనుగోలు విషయంలో రైతుల విజ్ఞప్తి మేరకు కొన్ని నిబంధనలు సవరించినట్టు ఏలూరు ఆర్డీఓ కె.పెంచల కిషోర్ ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉంగుటూరు మండలం నారాయణపురం, చేబ్రోలు గ్రామాల్లో రైతులు మాసూళ్లు చేసి ధాన్యం ఎగుమతి చేస్తున్న కళ్లాల వద్దకు వెళ్లి ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎకరాకు 92 నుంచి 100 సంచులకు పెంచి కొనుగోలుకు అనుమతించిందని, గతంలో ఎగుమతి చేసిన రైతులు మిగిలిన 8 సంచుల ధాన్యం ఇప్పుడు విక్రయించేందుకు అవకాశం ఉందన్నారు. అనంతరం ఉంగుటూరు ఆర్‌బీకేను పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రమణారావు, వ్యవసాయ అధికారి వెంకటేశ్వరరావు, డీసీఎంస్ మార్కెటింగ్ ఇన్‌చార్జి సంతోష్, కో–ఆపరేటివ్ సొసైటీలతో సమీక్షించారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

దే‘దీప్య’మానం



ప్రత్యేక దీపాలంకరణలో స్వామి, అమ్మవార్లు

కాళ్ల: కాళ్లకూరు వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో శనివారం రాత్రి సహస్ర దీపాలంకరణ సేవ (ఊంజల్ సేవ) నేత్రపర్వంగా జరిగింది. ప్రత్యేక దీపాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. ధర్మకర్తల మండలి అధ్యక్షుడు దండు వెంకటకృష్ణంరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం.అరుణ్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కీచక ఉద్యోగిపై సస్పెన్షన్ వేటు

‘సాక్షి’ వార్తపై స్పందించిన సీఈఓ

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాపరిషత్ కార్యాలయంలోని ఇంజనీరింగ్ సెక్షన్‌లో రికార్డు అసిస్టెంట్ అయిన మహిళా ఉద్యోగిని వేధించిన ఘటనలో అసభ్యకరంగా ప్రవర్తించిన సీనియర్ అసిస్టెంట్ వీరవల్లి విజయ్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లాపరిషత్ సీఈఓ రవికుమార్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. జిల్లా పరిషత్‌లో కీచకపర్వంపై ‘సాక్షి’లో వచ్చిన వార్తపై స్పందించిన సీఈఓ ముగ్గురు మహిళా ఉద్యోగులతో విచారణకు ఆదేశించారు. విచారించిన మహిళా బృందం సంఘటన వాస్తవం అని తేల్చింది. అలాగే ఆ శాఖ ఈఈ, డీఈలు సైతం ఘటన వాస్తవమని నివేదిక ఇవ్వడంతో జిల్లాపరిషత్ సీఈఓ చర్యలకు ఉపక్రమించారు. దీంతో విజయ్‌కుమార్‌పై సస్పెన్షన్ వేటు వేశారు. ఘటనను వెలుగులోకి తీసుకువచ్చిన ‘సాక్షి’కి జిల్లాపరిషత్ మహిళా సిబ్బంది, సీఈఓ అభినందనలు తెలిపారు.

ఆత్మహత్యలను నిరోధించాలి

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు టౌన్/ఏలూరు(మెట్రో): సమాజంలో బలవన్మరణాల నిరోధానికి ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందనే భరోసా కల్పించాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. ఏలూరు కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం ఆత్మహత్యల నిరోధంపై వైద్య ఆరోగ్యశాఖ, పత్రికా విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మహత్యలను నివారించడానికి కుటుంబ సభ్యులు, స్నేహితులు, ప్రభుత్వంతో పాటు మీడియా కీలకపాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. బలవన్మరణం వెనుక కారణాలను అధిగమించేందుకు అండగా నిలవాలని సూచించారు. సమస్యలకు పరిష్కారం చూపే మార్గాలను మానసిక నిపుణులు, వైద్యుల సలహాలతో తరచూ పత్రికల్లో ప్రత్యేక కథనాలు ప్రచురించడం ద్వారా ఆత్మహత్యల నివారణకు దోహదపడాలని కోరారు. సైక్రియాటిస్ట్, సైకాలజిస్టులతో కౌన్సెలింగ్ ఇప్పిస్తూ చైతన్యపరచాలన్నారు. టెన్త్, ఇంటర్ పరీక్షా ఫలితాలు రాబోతున్న తరుణంలో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేలా తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు అండగా ఉండాలని కోరారు.

టోల్‌ఫ్రీ 14416 : ఆర్‌బీఎస్‌కే జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ మానస మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన మార్గదర్శకాలను విలేకరులు పాటించడం ద్వారా మేలు జరుగుతుందన్నారు. ఆత్మహత్యలపై ప్రచురించే కథనాలను, వార్తల్లో అనవసర ఇతివృత్తాలను రాయకుండా సంయమనం పాటించాలని సూచించారు. ఒత్తిడిని జయించేందుకు పలు మార్గాలున్నాయని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన టెలీమానస్ టోల్‌ఫ్రీ నంబర్ 14416కు ఫోన్ చేసి ఒత్తిడి, ఆందోళన, మాదకద్రవ్యాల వినియోగం, మానసిక సమస్యలు, ఆత్మహత్యల ఆలోచనల నుంచి విడుదల పొందవచ్చని తెలిపారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డి.ఆశ, ప్రభుత్వ వైద్య నిపుణులు పాల్గొన్నారు.

సెంటిమెంట్ వైపే మొగ్గు

- అక్షయ తృతీయ రోజు అమ్మకాలు అదుర్స్
- ఉమ్మడి జిల్లాలో కళకళలాడుతున్న జ్యూయలరీ షాపులు
- రూ.8 కోట్ల వరకు బంగారం అమ్మకాలు



నరసాపురంలో కొనుగోలుదారులతో కళకళలాడుతున్న ఓ జ్యూయలరీ షాపు

నరసాపురం: అక్షయ తృతీయ సెంటిమెంట్ వర్కవుట్ అయ్యింది. శనివారం అక్షయ తృతీయ పర్వదినం రోజున ఉదయం నుంచే బంగారం షాపులు కొనుగోలుదారులతో కళకళలాడాయి. రాత్రి 9 గంటలైనా జ్యూయలరీ షాపులు రద్దీగానే ఉన్నాయి. నెల నుంచి పరుగులు పెట్టిన బంగారం ధరలు యాదృచ్ఛికంగా అక్షయ తృతీయ రోజునే స్వల్పంగా తగ్గాయి. శనివారం కాసు ధర రూ.300 తగ్గింది. దీనికి తోడు మరోవారం రోజుల్లో మూఢం వెళ్లిపోయి, పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కానుండటం కూడా అక్షయ తృతీయ అమ్మకాలకు కలిసొచ్చింది. చాలాకాలంగా బంగారం కొనుగోళ్లను వాయిదా వేసుకుంటూ వస్తున్న వారు అక్షయ తృతీయ రోజు బంగారం కొనడానికి మొగ్గుచూపారు. దీంతో అమ్మకాలు జోరుగా సాగాయి. గత నాలుగేళ్లలో అక్షయ తృతీయ రోజు ఉమ్మడి పశ్చిమ జిల్లాలో 2020, 2012 సంవత్సరాలలో కరోనా ప్రభావంతో అమ్మకాలు అంతగా సాగలేదు. గత ఏడాది కొంతమేర పుంజుకుంది. ఈ ఏడాది ధరలు పెరిగినా కూడా జిల్లాలో రికార్డు స్థాయిలో బంగారం అమ్మకాలు సాగాయని బులియన్ వర్గాలు చెబుతున్నాయి. నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు ముఖ్య పట్టణాల్లో అమ్మకాలు జోరుగా సాగాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆభరణాలు, బిస్కెట్ కలిపి రూ.8 కోట్లు వరకు అమ్మకాలు జరిగినట్లు అంచనా.


ఉమ్మడి పశ్చిమలో సంవత్సరాల వారీగా అక్షయ తృతీయ రోజు బంగారం అమ్మకాలు ఇలా..

సంవత్సరం	మొత్తం (రూ.కోట్లలో)		
		2020	30
		2021	2
2218	5	2022	6
2019	7	2023	8

విద్యుత్ శాఖలో నకిలీలు

విద్యుత్ శాఖలో 1997 సంవత్సరంలో చేపట్టిన కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణలో అవకతవకలు జరిగి పాతికేళ్లుగా అనర్హులు ఉద్యోగులుగా చెలామణి అవుతున్నారు. ఈ విషయాన్ని అదే శాఖలోని విజిలెన్స్ అధికారులు విచారణ చేసి తేల్చినా దిద్దుబాటు చర్యలు తీసుకోలేదు. ఇవే అర్హతలు ఉన్నా తమకు ఉద్యోగం దక్కలేదని కొందరు కోర్టును ఆశ్రయించగా వారికి అనుకూలంగా తీర్పు వచ్చినా అమలుకు నోచుకోలేదు. టీడీపీ ప్రభుత్వంలో ఈ వ్యవహారం జరగగా, సుమారు వంద మంది బాధితులు న్యాయం కోరుతూ ఇప్పటికీ విశాఖపట్టణంలోని ప్రధాన కార్యాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు.

- అనర్హులైనా ఉద్యోగులుగా చలామణి
- విచారణలో నిగ్గుతేలినా పట్టని వైనం
- పాతికేళ్లుగా పోరాటం చేస్తున్న అర్హులు
- గత టీడీపీ ప్రభుత్వంలోనే వ్యవహారం



తణుకు: తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీ ఈపీడీసీఎల్) పశ్చిమగోదావరి జిల్లా ఆపరేషన్ సర్కిల్ పరిధిలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న వారి సర్వీసులను ఎల్‌డీసీ, టైపిస్టు, సబ్‌ఇంజినీర్‌గా క్రమబద్ధీకరించాలని అప్పటి విద్యుత్ బోర్డు బీపీ/36 సర్క్యులర్ నంబర్‌తో నోటిఫికేషన్ జారీ చేసింది. దీని ప్రకారం క్యాజువల్ లేబర్‌ను క్రమబద్ధీకరించాలని ఉత్తర్వులు ఉన్నాయి. అయితే జిల్లాలో ఉన్న ఖాళీల్లో 50 శాతం మేర భర్తీ చేయాలని నిర్ణయించారు. అయితే కొందరు కోర్టును ఆశ్రయించడంతో ఈ పోస్టులను భర్తీ కోసం 1997 మే 18న నోటిఫికేషన్ జారీ చేశారు. సుమారు 520 మంది ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్నారు. ఇంటర్వ్యూలు పూర్తి చేసి రెండు దఫాలుగా 1999, 2003లో అర్హులను ప్రకటించారు. వీరిలో 199 మంది జూనియర్ లైన్‌మేన్లు, ఎల్‌డీసీలు, సబ్‌ఇంజనీర్లు ఉన్నారు. మిగిలిన వారికి ఉద్యోగాలు ఇవ్వలేమంటూ అధికారులు చేతులెత్తేశారు. అయితే ఉద్యోగాలు పొందిన వారికి ఉన్న అర్హతలే తమకూ ఉన్నాయంటూ అనర్హులుగా అధికారులు తేల్చి చెప్పిన అభ్యర్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వారికి అనుకూలంగా తీర్పు వచ్చినా అధికారులు పరిగణనలోకి తీసుకోలేదు.

కాసుల కోసం కక్కుర్తి

కేవలం కాసుల కోసం కక్కుర్తిపడి దిగువ స్థాయి సిబ్బంది నిర్వాకంతోనే అడ్డదారిలో ఉద్యోగాల భర్తీకి తెరలేచిందని తెలుస్తోంది. ఒక ఉద్యోగి సమీప బంధువులైన ఇద్దరు మహిళలకు ఏ ప్రాతిపదికన ఉద్యోగాలు ఇచ్చారనే ప్రశ్నలకు అధికారుల వద్ద సమాధానం లేదు. అయితే అప్పటి కొందరు అభ్యర్థులు పోరాడుతుండటంతో 2015లో అప్పటి సీఎండీ ముత్యాలరాజు విచారణకు ఆదేశించగా, ఉద్యోగాలు పొందిన వారిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 31 మంది అనర్హులు ఉన్నారని జేఎండీ విజిలెన్స్ ఇచ్చిన నివేదికలో తేల్చారు. వీరిలో నకిలీ విద్యార్హత, సర్వీసు సర్టిఫికెట్లు సమర్పించినవారు ఉన్నారని, అంతేకాక ఒకరి సర్టిఫికెట్లపై మరొకరు ఉద్యోగాలు చేస్తున్నట్లుగా విచారణలో వెల్లడైంది.

ఒకరి సర్టిఫికెట్లతో మరొకరు ఉద్యోగం

న్యాయస్థానం ఆదేశాల మేరకు విశాఖపట్టణంలోని విచారణ విభాగం డీఈ కె.కృష్ణమోహన్ విచారణ చేశారు. ఉద్యోగాలు పొందిన ముగ్గురు ఒకే సమయంలో ఇద్దరు కాంట్రాక్టర్ల వద్ద పనిచేస్తున్నట్లుగా ధ్రువీకరణ పత్రాలు జతచేయడం అనర్హతగా తేల్చారు.. అంతేకాకుండా ఒకరి సర్టిఫికెట్‌పై మరొకరు ఉద్యోగం పొందారు. ఈ క్రమంలో సదరు వ్యక్తి మృతి చెందడంతో అసలు వ్యక్తి పేరుతో డెత్ సర్టిఫికెట్ వచ్చింది. ఆ వ్యక్తి భౌతికంగా ఉన్నా రికార్డుల్లో చనిపోయినట్లు ఉండటంతో మరో వ్యక్తి సర్టిఫికెట్‌తో సదరు వ్యక్తి ఉద్యోగం చేస్తున్నట్లు గుర్తించారు. ఈ వ్యవహారం ఇటీవల వెలుగు చూడటంతో సదరు వ్యక్తిని సస్పెండ్ చేశారు. అయితే అతని డెత్ సర్టిఫికెట్‌ను ఆ శాఖలోని ఉద్యోగులే మాయం చేయడం గమనార్హం. అంతేకాకుండా మరో ముగ్గురు అక్రమంగా ఉద్యోగాలు చేస్తున్నట్లు నిర్ధారించారు. వీరికి సంస్థ ఉద్యోగులు కొందరు నిబంధనలు అతిక్రమించి సహకరించినట్లు తేల్చారు. వీరిపై ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. అయితే అర్హత ఉండి సర్టిఫికెట్లు అందజేసిన అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వకుండా మొండిచేయి చూపారు.

పాతికేళ్లుగా పోరాడుతున్నాం



అప్పట్లో షిఫ్టు ఆపరేటర్‌గా విధులు నిర్వర్తించా. విద్యుత్ బోర్డు నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగాలు పొందిన వారితో పాటు అదే సమయంలో అర్హత ఉండి ఉద్యోగాలు నిరాకరించిన వారిని బహిరంగ విచారణ చేపట్టాలి. పాతికేళ్లుగా న్యాయం కోసం పోరాడుతున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారానే మాకు న్యాయం జరుగుతుందని భావిస్తున్నాం.

– గోకవరపు శ్రీను, భీమవరం

విచారణలో తేలినా చర్యలు లేవు



నకిలీ విద్యార్హత, సర్వీసు సర్టిఫికెట్లతో ఉద్యోగాలు చేస్తున్న వారిపై మరోసారి విచారణ చేపట్టాలి. గతంలో విజిలెన్స్ అధికారులు విచారణ చేసి అనర్హులకు ఉద్యోగాలు వచ్చిన మాట వాస్తవమేనని తేల్చారు. అయినప్పటికీ విద్యుత్ శాఖ అధికారుల్లో చలనం లేదు. ఇప్పటికైనా ఈ వ్యవహారంపై ఉన్నత స్థాయిలో విచారణ చేపట్టాలి.

– అక్కిపల్లి శ్రీనివాసరావు, ఏలూరు

అవకతవకలపై తెలిసింది

విద్యుత్ శాఖలో నకిలీ ఉద్యోగుల వ్యవహారంపై పూర్తి స్థాయిలో నా దృష్టికి రాలేదు. ఐదు నెలల క్రితమే ఉద్యోగ బాధ్యతలు స్వీకరించాను. ఒకసారి మాత్రం కార్పొరేట్ కార్యాలయం నుంచి వివరాలు అడిగారు. గత ఏడాది మార్చిలో జరిగిన పరిణామాలు అనంతరం వ్యవహారం అలాగే ఉందని సమాచారం. గతంలో కొన్ని అవకతవకలు జరిగినట్లుగా తెలిసింది.

– పి.సాల్మన్‌రాజు, ఎస్ఈ ఆపరేషన్ సర్కిల్, ఏలూరు

అనుమానాస్పద స్థితిలో కొరియర్ బాయ్ మృతి



శివదుర్గ ప్రసాద్ (ఫైల్)

ద్వారకాతిరుమల: తిరుమలంపాలెంకు చెందిన దివ్యాంగుడైన ఓ కొరియర్ బాయ్ ఈ నెల 18న అదృశ్యం కాగా, శనివారం గ్రామం శివారులో ఉన్న ఓ కొబ్బరితోటలో చెట్టుకు వేలాడుతూ విగతజీవిగా కనిపించాడు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దివ్యాంగుడైన నాయుడు శివదుర్గ ప్రసాద్ (26) ద్వారకాతిరుమలలోని ఈ-కార్ట్‌లో కొరియర్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 18న శివదుర్గ ప్రసాద్ అదృశ్యం కాగా, సోదరుడి ఫిర్యాదు మేరకు ఈ నెల 19న మిస్సింగ్ కేసు నమోదైంది. ఇదిలా ఉంటే తిరుమలంపాలెం శివారులోని ఒక కోకో, కొబ్బరి తోటలోకి శనివారం పనులకు వెళ్లిన కూలీలకు ఓ మృతదేహం చెట్టుకు వేలాడుతూ కనిపించింది. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించగా, ఎస్సై టి.సుధీర్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి ప్రసాద్‌గా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు తరలించారు. క్రికెట్ బెట్టింగ్‌ల కారణంగా శివదుర్గ ప్రసాద్ అప్పులపాలై ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని స్థానికులు చెబుతున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

■ రాజమండ్రి దివాన్ చెరువు '81' గ॥ E/F స్థలము 5 లక్షలు మాత్రమే. DTCP అప్రూవ్డ్ 128 గ॥ స్థలములు సులభ వాయిదా పద్ధతిలో అమ్మకం. ఫోన్ : 95737 07178, 72076 87589 [V-1838]

■ గొప్ప సువర్ణావకాశం రూ. 6,00,000 పెట్టుబడితో 25 సెంట్లు సొంతం! ఈ భూమిలో 100 ఎర్రచందనం మొక్కలు! ప్రకాశం జిల్లా పొదలకి 10 కిలోమీటర్లు ఇవతల, ఒక సంవత్సరంలో ఈ భూమి రెట్టింపు 9 సంవత్సరాలలో కోటీశ్వరులు అయ్యే అవకాశం ! మొక్కలు పెంచే బాధ్యత మొత్తం కంపెనీ 30% కొనుగోలుదారులకు 70% ఆదాయం ఇవ్వబడును. సంప్ర ✆ 99635 61116 [B-822]

LAND FOR SALE

■ తణుకు వీరభద్రపురం మున్సిపాలిటీ వెల్పూరు రోడ్డుని అనుకొని ఉన్న కమర్షియల్ సైట్ 1368 చ॥గ॥ స్థలం ఏక మొత్తంగా కాని రెండు బిట్లుగా కాని అమ్మబడును. సంప్ర: 9247739337 [P-1214971]

HOUSE FOR SALE

■ ఏలూరు శ్రీబాలాజీ హౌసింగ్ సొసైటీ. పోలీస్‌కాలని దగ్గరలో Duplex Houses, North,West Facing, క్లియర్ టైటిల్‌తో అమ్మకంనకు కలవు. సంప్ర: 99488 47689, 95535 11126 [P- 811]

■ ఏలూరు చోదిమెళ్ళ సాయిబాబా గుడి వద్ద గృహప్రవేశానికి సిద్ధముగా ఉన్న 200 చ॥గ॥ ఇండివిడ్యువల్ ఇల్లు అమ్మకమునకు కలదు. శ్రీకన్‌స్ట్రక్షన్. సంప్ర॥ 98664 27721. [P-1214892]

■ భీమడోలు జంక్షన్ SBI BANK దగ్గరలో మెయిన్‌రోడ్ కి చేర్చి 144 చ॥గ॥ల 25 వేలు రెంట్స్ వస్తున్న రెండు స్టేర్స్ బిల్డింగ్ అమ్మకము. సంప్రదించండి : 63046 86230. [P- 1214893]

FLAT FOR SALE

■ ఏలూరు శాంతినగర్ మెయిన్‌రోడ్ ఫిరంగులదిబ్బ హనుమాన్ గుడి వద్ద, 3BHK, 4th Floor 3 years old, తూర్పు ఫేసింగ్ గల 1600 Sft Flat అమ్మకమునకు కలదు. ఫోన్: 82476 32961 [V-1843]

■ ఏలూరు శ్రీరామ్ నగర్ 12వ రోడ్ లో సారథి పంక్షన్ హాల్ దగ్గర గృహప్రవేశానికి సిద్ధంగా నున్న తూ ఫేస్, 2BHK ఫ్లాట్ 1100 sft అన్ని వసతులతో ఆకర్షణీయమైన బహుమతులతో అమ్మకానికి కలదు . సంప్ర 9848198565, 9640178835. [C-784790]

LAND FOR SALE

■ నెల్లూరు టౌన్ నుండి 17km, అమంచర్లకు దగ్గరగా మామిడి,నిమ్మ,మహాగని మొక్కలతో, 3 బోర్లు, 3 షెడ్లు, 3 ప్రక్కల ఫెన్సింగ్, డ్రిప్ సిస్టమ్‌తో పూర్తిగా డెవలప్ చేసిన 20 ఎకరముల పొలం అమ్మబడును. సెల్: 94417 86275. [N-785302]

■ ద్వారకా తిరుమల కు 3.5 K.M దూరంలో ఏలూరు - కామవరపుకోట రోడ్ నుండి వయా వడ్లపల్లి to వెంకట కృష్ణాపురం రోడ్ ఫేసింగ్, గుండుగొలను గుంట పంచాయితీ, 16ఎ॥ 50 సెంట్లు పామాయిల్, కొబ్బరి & కోకో తోట, పుష్కలమైన నీరు, 2 బోర్లు, డ్రిప్, సర్వెంట్స్‌కు వసతి గల భూమి 2/3/4/5 ఎకరాలుగా కూడా అమ్మబడును. ఎకరం 60 లక్షలు. ఫెన్సింగ్ & గేట్స్ కలవు.సీరియస్ పార్టీస్ మాత్రమే సంప్రదించగలరు. వి.ప్రభాకర్ సెల్: 9440524616 [P-1214886]

Services

BUSINESS OFFER

■ అద్భుత వ్యాపార అవకాశం! గ్యాస్ ప్రమాదాలను అరికట్టే సేఫ్టీ డివైస్ ప్రమోట్ చేస్తూ రో॥ 5000/- వరకు సంపాదించే అవకాశం, ఏరియా వైజ్ ఫ్రాంఛైజీలకై సంప్ర: 9100532959 [H-797452]

Wanted

■ Wanted Computer Teachers, Receiptionist, English Teachers P.R.O's work in Tanuku, Jangareddygudem, Eluru. BRAIN TECH org. 91776 42339. [P-1214888]

■ Lady Teachers to Teach Primary classes all subjects Q.D.Ed, B.Ed, PG Degree Variant primary School R.R.Pet Eluru. Ph:94902 93441, 99085 43399 [P-1214627]

■ చైతన్య ఎమర్జెన్సీ హాస్పటల్ నందు పనిచేయుటకు B.Sc. నర్సింగ్ OT టెక్నీషియన్స్, GNM STAFF కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్ర॥ 98482 59977. [P- 817]

■ స్టేట్ బ్యాంక్ లైఫ్ రాజమండ్రిలో అడ్వైజర్ల నియామకం. అర్హత : 10th వయస్సు 30 అపైన. ఆసక్తి గల అభ్యర్థులు సంప్ర॥ రిటైర్డ్ ఉద్యోగులు, మహిళలకు, పోస్టల్ మరియు రియల్ ఎస్టేట్ ఏజెంట్స్‌కు ప్రాధాన్యత. ✆ : 94905 94545 [R-932]

■ విజయవాడలో A/c & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/c టెక్నీషియన్స్-3, డోర్స్ డ్రైవర్లు-3, హెల్పర్లు-5, 30సం.లోపు జీ: 18-25,000 ట్రైనింగ్/భోజనం/వసతి ఫ్రీ ✆ 90300 44646. [B-1165937]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం॥ 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-785869]

■ **Wanted Maths Teacher, 7th to 10th (EM) Qualification: Any Degree, Location: Tanuku. Contact Number : 74164 62564** [G-6732]

■ **Wanted Dip. ECE,ITI Electronics** ,Fitters & Welders for reputed Electronics & Engg. Industries at Hyderabad. Ph: 9000950038, 9625064269. [HA-29378]

■ TANMAYEE ఓల్డేజ్ హోమ్, YSR సర్కిల్ వద్ద, పైపుల రోడ్డు, విజయవాడ, సూపర్‌వైజర్, ఆయాలు, వంటమనిషి కావలెను. వయసు 20 నుండి 50 సం॥ ఫోన్ : 9652423559, 7093911010, 9573000987 [HA-66]

■ కాకినాడలో మా ఇంట్లోనే ఉండి వంటపని చేయుటకు 35 నుండి 55 సం॥లు వయస్సు గల బాదర బందీ లేని స్త్రీ కావలెను. ✆ : 73968 44153 90638 51568 [R-20]

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-797521]

■ ఈశ్వర్ హోంకేర్ సర్వీస్ 24 గం॥లు వృద్ధలను పేషెంట్‌ను, పిల్లలను చూసుకోవడానికి ఇంటి/వంట పనికి ఆడ/మగ వారు కావలెను. జీ: 16,000/- ఫ్రీ వసతి+ భోజనం. ఫోన్ : 8985115277, 8520921099 [H-796894]

■ హైదరాబాద్‌లో 24గంటలు ఇంట్లో ఉంటు ఇంటిపని లేదా బేబీకేర్ చేయుటకు ఏ బాదర బంది లేనీ 50సం॥ లోపు మహిళలు కావలెను. జీ. 18,000/- డైరెక్ట్ జాబ్.9059500749 [H-781653]

■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను. ఆయా, వార్డ్ బాయ్స్, నర్సులు, వంటవారు, RMP, Dr., Q: 5th - డిగ్రీ. 10-30 వేల జీతం, భో+రూం ఫ్రీ, Hyd. Ph: 7995374999 [HA-85]

■ శ్రీపాండురంగ మెగా ఐస్‌క్రీమ్ పార్లర్ (జ్యూస్ షాపు)లో ప.గో. జిల్లా, పాలకొల్లు టౌన్‌లో పనిచేయుటకు హెల్పర్స్ యువకులు(చదువులేకున్నా సరే) కావలెను జీతం,వసతి+భోజనం+టిఫిన్+టి.ఫ్రీ.9346621376 [H-781574]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ వార్డెన్స్, లేడీ సూపర్‌వైజర్స్ ఆయాలు, భార్యా భర్తలు కావలెను. ఫోన్: 9391036931, 9246585901 [HA-10733]

■ షాద్‌నగర్ (Hyd) దగ్గరలో గల 6 లక్షల లేయర్ కోళ్ళ ఫారంనకు ఫాం మేనేజర్ & షెడ్డు సూపర్‌వైజర్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం అనుభవం కల్గిన వారికి ప్రాధాన్యత. సంప్రదించండి. చలపతిరావు. సెల్: 9948223550 [G-785923]

■ హైదరాబాద్ నందు క్రిస్టియన్ హోంకేర్ సర్వీస్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుకోవటానికి M/F ఆయాలు కావలెను. మంచి జీతం, వసతి, భోజనం. ఫోన్ : 9030777509, 8077030288 [HA-1436]

■ శ్రీరామచంద్ర విద్యాసంస్థల నందు 1st to 10th, Inter, Degree అన్ని సబ్జెక్టులలో బోధించుటకు అనుభవజ్ఞులైన టీచర్స్ మరియు లెక్చరర్స్ కావలెను. ఇంటర్వ్యూ: ఏప్రిల్-23, సమయం:ఉదయం 10గం॥ నుండి, స్థలం: శ్రీరామచంద్ర MAAC Society Ltd., బస్టాండ్ ఎదురుగా, జంగారెడ్డిగూడెం. 91827 00571, 78834 12999. [P-818]

■ యూరప్‌లో అందరికి జాబ్స్ అన్ని రకాల పనులు ఉద్యోగాలు కలవు. ఆడ మరియు మగ వారికి, వయస్సు 20-50, 10th పాస్/ఫెయిల్, అడ్వాన్స్ కట్టక్కరలేదు. అగ్రిమెంట్ ఇవ్వ బడును. మీరు యూరప్‌లో పనిచేయ్యాలను కుంటే సంప్ర: 8019520131, 9966732006 [G-6803]

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందిం చాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఇద్దరి అరెస్టు.. 40 లీటర్ల సారా స్వాధీనం

పోలవరం రూరల్: పోలవరం మండలంలోని కొత్త తోటగొంది సమీపంలో సారా కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై ఎస్‌ఎస్ పవన్‌కుమార్ శనివారం చెప్పారు. కొక్కిర రమేష్, కారం శేఖర్ అనే వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. డీఎస్పీ కె.లతాకుమారికి అందిన సమాచారం మేరకు ఈ దాడి చేసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతానికి యువకుడి మృతి



వెంకటేష్

కొయ్యలగూడెం: విద్యుత్ షాక్‌కు గురై కారు సర్వీసింగ్ సెంటర్ లీజుదారుడు మృతి చెందాడు. ఎస్సై జీజే విష్ణువర్ధన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొయ్యలగూడెంకు చెందిన బండారు వెంకటేష్ (30) గవర్నమెంట్ హాస్పిటల్ ఎదురుగా ఉన్న ఇండియన్ ఆయిల్ బంకు వెనుక ఉన్న కారు సర్వీసింగ్ సెంటర్‌ను లీజుకు తీసుకుని నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం కార్ వాష్ చేస్తుండగా, నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో విద్యుత్ పంపు మరమ్మతులకు గురైందేమోననే అనుమానంతో దానిని కదిపే ప్రయత్నం చేయగా, వెంటనే విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే అక్కడి సిబ్బంది అతనిని ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

పోలవరం రూరల్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను బలవంతంగా పెళ్లి చేసుకుని, అత్యాచారయత్నానికి పాల్పడిన ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ శనివారం చెప్పారు. పి.అయ్యప్ప అనే యువకుడు బాలికను బలవంతంగా పెళ్లి చేసుకుని అనంతరం పలు గ్రామాల్లో ఆమెను నిర్బంధించాడు. ఈ క్రమంలో బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాలిక అతడి చెర నుంచి తప్పించుకుని బంధువులకు సమాచారం ఇవ్వగా వారు ఇంటికి తీసుకువచ్చారు. అనంతరం బాలిక పోలీసులను ఆశ్రయించగా, డీఎస్పీ కె.లతాకుమారి ఆదేశాల మేరకు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గడపగడపకు సంక్షేమం



ముదినేపల్లి రూరల్ : చినపాలపర్రు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాల నుంచి అందిన లబ్ధిని వివరిస్తున్న కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు



చింతలపూడి: శివపురం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ వృద్ధుడి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

హీరో వాట్సాప్ స్టేటస్ మార్చమన్నాడని..

అత్తిలిలో పెయింటర్ హత్య



కిశోర్ మృతదేహం

అత్తిలి: సినీ హీరోలను ఫోన్‌లో వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకునే విషయమై ఇద్దరు పెయింటర్ల మధ్య జరిగిన వివాదం హత్యకు దారి తీసింది. తణుకు సీఐ సీహెచ్ ఆంజనేయులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఏలూరుకు చెందిన హరికుమార్, కిశోర్ పెయింటర్లు. మూడు రోజుల క్రితం వీరు అత్తిలి మసీదు వీధిలో నజీర్‌కు చెందిన కొత్త ఇంటికి రంగులు వేసే పనుల నిమిత్తం వచ్చారు. పనులు చేసుకుంటూ ఇక్కడే నిద్రిస్తున్నారు. హరికుమార్ హీరో ప్రభాస్ అభిమాని. ఏలూరు ప్రభాస్ అభిమాన సంఘానికి కార్యదర్శిగా కూడా ఉన్నాడు. శుక్రవారం రాత్రి తన ఫోన్ వాట్సాప్‌లో ప్రభాస్ వీడియోను స్టేటస్‌గా పెట్టుకున్నాడు. కిశోర్ పవన్‌కల్యాణ్ అభిమాని కావడంతో పవన్ కల్యాణ్‌ను స్టేటస్‌గా పెట్టుకోవాలని హరికుమార్‌ను కోరాడు. దీంతో వీరిద్దరి మధ్య వివాదం రేగింది. దీంతో క్షణికావేశంలో హరికుమార్ సెంట్రింగ్ కర్రతో కిశోర్ తలపై బలంగా కొట్టి అక్కడే ఉన్న సిమెంటు రాయితో ముఖంపై బాదడంతో కిశోర్ అక్కడికక్కడే మృతి చెందాడు. హత్య జరిగిన విషయాన్ని తెలుసుకున్న అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు, నర్సాపురం డీఎస్పీ రవిమనోహరాచారి, తణుకు సీఐ ఆంజనేయులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. నిందితుడు హరికుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై సీఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో ఎస్సై కేసీహెచ్ స్వామి కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు కిశోర్ భార్యతో విడాకులు తీసుకున్నాడని, ఒక కుమారుడు ఉన్నాడని ఎస్సై తెలిపారు.

పేదలకు స్థలాలిస్తే అడ్డుకోవడం దుర్మార్గం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అమరావతిలో పేదవాడికి జానెడు జాగా ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుని చదును చేస్తుంటే, రైతుల ముసుగులో బాబు అండ్ కో, కులవాదులు అడ్డుకోవడం దుర్మార్గమని మాలమహానాడు జాతీయ అధ్యక్షులు చీకటిమిల్లి మంగరాజు ధ్వజమెత్తారు. శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చట్టసభల సాక్షిగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుని సీఆర్‌డీఏ చట్టంలో పొందుపరిచిన విధంగానే ఐదు శాతం భూమిని పేదలకు కేటాయిస్తుంటే అడ్డుకునే హక్కు కులవాదులకు ఎవరిచ్చారని మండిపడ్డారు. ప్రభుత్వానికి భూమిలిచ్చేసిన తరువాత రైతులకు వాటిపై అధికారం ఎలా ఉంటుందో చెప్పాలన్నారు. వీరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ తరహాలో కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అమరావతి అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ అడుగులు వేస్తుంటే కులవాదులు అడుగడుగునా అడ్డుతగలడం సిగ్గుచేటన్నారు. శ్రీను, అచ్చిబాబు, బాబ్జి, ఆనంద్ పాల్గొన్నారు.